ప్రజాశక్తి
శనివారం 27 డిసెంబరు 2025
5
శ్రీకాకుళం



నేడు రథసప్తమి ఉత్సవాలపై ప్రజాభిప్రాయ సేకరణ

శ్రీకాకుళం సిటీ : అరసవల్లి ఆలయంలో నిర్వహించే రథసప్తమి వేడుకల ఏర్పాట్లపై సూచనలు, సలహాల స్వీకరణపై ఈనెల 27వ తేదీన జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో సాయంత్రం నాలుగు గంటలకు సమావేశం నిర్వహించనున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు, ఆలయ సంప్రదాయాలు తెలిసిన పెద్దలు, ఉత్సవ నిర్వహణలో అనుభవం ఉన్న వ్యక్తులు, ఆధ్యాత్మిక, సాంస్కృతిక సంఘాలు, మీడియా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, వ్యాపార, రవాణా రంగాల ప్రతినిధులతో పాటు సామాన్య భక్తులు కూడా హాజరై తమ సలహాలు అందజేయవచ్చని సూచించారు. అరసవల్లి ఇఒ, ప్రధాన అర్చకులు, ఆలయ సిబ్బంది, రెవెన్యూ, పోలీస్, వైద్య, విద్యుత్, ఆర్‌టిసి, అగ్నిమాపక, పౌరసరఫరాలు, ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్, మున్సిపల్, ఆహార భద్రత, పర్యాటక శాఖల అధికారులు పాల్గొనాలని ఆదేశించారు.

భూ సమస్యలపై వినతుల వెల్లువ

- **వేలల్లో వినతులు... పదుల సంఖ్యలో పరిష్కారం**
- **మళ్లీ తహశీల్దార్లకే రిఫరెన్స్**
- **నిరాశతో వెనుదిరిగిన రైతులు, భూ యజమానులు**
- **ప్రాధాన్యతా క్రమంలో 22-ఎ సమస్యల పరిష్కారం : మంత్రి అచ్చెన్నాయుడు**

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

భూ సమస్యలపై వినతులు వెల్లువెత్తాయి. జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన 'మీ చేతికి మీ భూమి' ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమానికి రైతులు, భూ యజమానులు భారీగా తరలివచ్చారు. మరోవైపు గ్రామస్థాయి నుంచి మండల స్థాయి వరకు ఉన్న రెవెన్యూ అధికారులను సైతం పిలవడంతో జెడ్‌పి ప్రాంగణం లోపల, వెలుపలా జనంతో కిక్కిరిసిపోయింది. జిల్లా రెవెన్యూ యంత్రాంగమంతా ఒకచోటే కేంద్రీకృతమైనా, అసలు లక్ష్యం నెరవేరలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఫిర్యాదుదారులు ఇచ్చిన వినతులను ఆలకించి మళ్లీ తహశీల్దార్ల రిఫరెన్స్‌కే పంపడంతో రైతులు తీవ్ర అసంతృప్తికి లోనయ్యారు. ఏళ్ల తరబడి తాము పడుతున్న భూ సమస్యలు పరిష్కారమవుతాయని ఎంతో ఆశతో సుదూర ప్రాంతాల నుంచి తీవ్ర వ్యయ ప్రయాసలకోర్చి వచ్చిన రైతులు, భూ యజమానులకు తీవ్ర నిరాశే మిగిలింది.

నిషేధిత జాబితా (22ఎ)లోకి వెళ్లిన భూ సమస్యలపై 'మీ చేతికి... మీ భూమి' పేరుతో నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్‌కు అనూహ్య స్పందన వచ్చింది. 22-ఎ భూముల సమస్యలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, అధికారులు పెద్దఎత్తున ప్రచారం చేయడంతో రైతులు భారీగా తరలి వచ్చారు. నిషేధిత జాబితా భూముల సమస్యలపైనే డ్రైవ్ నిర్వహిస్తున్నామని ప్రకటనలు విడుదల చేసినా, అన్నిరకాల భూ సమస్యలపైనా వినతులు సమర్పించుకునేందుకు జిల్లా నలుమూలల నుంచి రైతులు వచ్చారు. 22ఎ భూముల సమస్య పరిష్కారానికి కొంచెం ఎక్కువ సమయం పడుతుందన్న ఉద్దేశంతో, తొలుత ఇతర భూ సమస్యలపై ఫిర్యాదులను స్వీకరించారు. ఫిర్యాదుదారుల నుంచి వినతులను స్వీకరించి మళ్లీ తహశీల్దార్లకే అప్పగించారు.

22-ఎ భూములపై జెసి ప్రత్యేక విచారణ

22-ఎ భూముల సమస్యలపై గతంలో గ్రీవెన్స్‌లో ఇచ్చిన వినతులపై నోటీసులు అందుకున్న 37 మంది ఫిర్యాదుదారుల సమస్యలపై జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ విచారణ చేపట్టారు. జెడ్‌పి సమావేశ మందిరానికి ఆనుకొని ఉన్న ఛాంబర్‌లో ఫిర్యాదుదారుల చూపిన రికార్డులను పరిశీలించారు. వారి వాదనలను విన్నారు. ఇక్కడ కూడా అధిక భాగం వినతులను మళ్లీ తహశీల్దార్ల రిఫరెన్స్‌కే పంపడంతో ఉసూరుమంటూ తిరుగుముఖం పట్టారు.



రైతులు, భూ యజమానులతో కిక్కిరిసిపోయిన జెడ్‌పి సమావేశ మందిరం

వినతుల సమర్పణలో తీవ్ర గందరగోళం

అధికారుల ప్లానింగ్ లోపంతో తీవ్ర గందరగోళం ఏర్పడింది. వినతులతో వచ్చిన వారికి ఎక్కడ రిజిస్ట్రేషన్ చేయించాలో, ఎక్కడ ఆన్‌లైన్ నమోదు చేయించాలో తెలియక రైతులు, భూ యజమానులు తీవ్ర అయోమయానికి లోనయ్యారు. జెడ్‌పి సమావేశ మందిరం ప్రవేశ ద్వారం వద్ద మూడు డివిజన్లకు సంబంధించి ఒకేచోట రిజిస్ట్రేషన్ల నమోదు చేయడంతో రైతులు, భూ యజమానులతో కిక్కిరిసిపోయింది. రిజిస్ట్రేషన్ కోసం అంతా పోటీ పడడంతో ప్రవేశద్వారం వద్ద ఉన్న పోలీసులు రైతులు, భూ యజమానులను నెట్టేశారు. ఫిర్యాదులు సమర్పించేందుకు జెడ్‌పిలోకి వెళ్లేందుకు ప్రయత్నించిన ఫిర్యాదుదారులపై పోలీసులు దురుసుగా ప్రవర్తించారు. ఏదోవిధంగా అష్టకష్టాలు పడి లోపలకు వెళ్లి వినతులు సమర్పించినా, తిరుగు టపాలో మళ్లీ తహశీల్దార్ల రిఫరెన్స్‌కే వెళ్లడంతో అంతా నిటూర్చారు. సుదూర ప్రాంతాల నుంచి తీవ్ర వ్యయ ప్రయాసల కోర్చి వచ్చిన రైతులు, భూ యజమానులకు గంటల తరబడి నిరీక్షించినా పని నెరవేరకపోవడంతో వారంతా తీవ్ర నిరాశతో వెనుదిరిగారు.

ప్రాధాన్యతా క్రమంలో 22-ఎ సమస్యల పరిష్కారం

గత వైసిపి ప్రభుత్వం చేసిన తప్పిదాల వల్ల అనేక గ్రామాలు 22-ఎ పరిధిలోకి వెళ్లాయని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. నిషేధిత జాబితాలోని భూ సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తామని చెప్పారు. గ్రీవెన్స్‌కు వస్తున్న వినతుల్లో 90 శాతం రెవెన్యూ సమస్యలేనని గుర్తు చేశారు. వీటిని పరిష్కరించేందుకు విఆర్‌ఒ నుంచి కలెక్టర్ వరకు రెవెన్యూ యంత్రాంగాన్ని ఒకేచోట చేర్చి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టిసారించామని తెలిపారు. సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తహశీల్దార్లకు, ఆర్‌డిఒలకు ప్రత్యేక అధికారాలు జారీ చేశారని తెలిపారు. ముఖ్యమంత్రి స్వయంగా ప్రతిరోజూ తన లాగిన్ ద్వారా సమస్యల పురోగతిని పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. న్యాయపరమైన చిక్కులు ఉన్న భూములు తప్ప మిగిలిన అన్ని సమస్యలను పరిష్కరించి రికార్డులను అప్‌డేట్ చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు బగ్గు రమణమూర్తి, గొండు శంకర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, డిఆర్‌ఒ ఎస్.వి లక్ష్మణమూర్తి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పద్మావతి, ఆర్‌డిఒలు కె.సాయిప్రత్యూష, కృష్ణమూర్తి, వెంకటేష్, దేవాదాయ, స్టాంపులు, రిజిస్ట్రేషన్, అటవీశాఖల అధికారులు, తహశీల్దార్లు పాల్గొన్నారు.



రైతులను నెట్టేస్తున్న పోలీసులు



మాట్లాడుతున్న అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు బేబిరాణి

4న చలో విశాఖపట్నం

- **సిఐటియు అఖిల భారత మహాసభలు జయప్రదం చేయాలి**
- **అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు జి.బేబిరాణి**

ప్రజాశక్తి - పాతపట్నం

జనవరి నాలుగో తేదీన చలో విశాఖపట్నం జయప్రదం చేయాలని ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు, సిఐటియు అఖిల భారత ఉపాధ్యక్షులు జి.బేబిరాణి పిలుపునిచ్చారు. పాతపట్నంలో శుక్రవారం నిర్వహించిన అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సమావేశంలో ఆమె మాట్లాడారు. డిసెంబరు 31 నుంచి 2026 జనవరి 4వ తేదీ వరకు విశాఖపట్నంలో సిఐటియు అఖిల భారత మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జనవరి 4న మధ్యాహ్నం రెండు గంటలకు విశాఖపట్నం ఆర్‌టిసి కాంప్లెక్స్ అంబేద్కర్ విగ్రహం నుంచి ప్రదర్శన అనంతరం మున్సిపల్ స్టేడియంలో భారీ బహిరంగసభ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ ప్రదర్శన, బహిరంగ సభలో అంగన్వాడీలంతా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు, సంక్షేమ పథకాలు అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెనూ ఛార్జీలు పెంచాలని కోరారు. డిఎ రాని స్కీమ్ కార్మికులకు రెండేళ్లకోసారి వేతనాలు పెంచాల్సిన అవసరం ఉందన్నారు.

ఆరేళ్లుగా వేతనాలు పెంచకుండా గత ప్రభుత్వంతో పాటు ఈ ప్రభుత్వం కాలయాపన చేస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో 4,687 మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చినా, వారికి ఇంతవరకు పెరిగిన వేతనాలు ఇవ్వలేదన్నారు. మిగిలిన మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని డిమాండ్ చేశారు. హెల్పర్ల ప్రమోషన్లలో రాజకీయ జోక్యాన్ని నివారించి అర్హులకు ప్రమోషన్లు ఇవ్వాలని కోరారు. ప్రాథమిక పాఠశాలల్లో అంగన్వాడీ సెంటర్లను విలీనం చేయాలనే ప్రభుత్వ నిర్ణయం అంగన్వాడీ సెంటర్లకు నష్టం చేస్తోందని చెప్పారు. ఐసిడిఎస్ స్థాపన లక్ష్యానికి విరుద్ధంగా యాప్‌ల పేరుతో పోషకాహారాన్ని లబ్ధిదారులకు దూరం చేసే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తుందని విమర్శించారు. ఐసిడిఎస్‌కు కేంద్ర ప్రభుత్వం అరకొర నిధులను కేటాయించడం వల్ల మాతాశిశు మరణాలు తగ్గించడం మందకొడిగా సాగుతోందన్నారు. సమావేశంలో యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.కళ్యాణి, డి.సుధ, జిల్లా ఉపాధ్యక్షులు బి.శాంతామణి, జె.కాంచన, రాణి తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణం తనిఖీ

ప్రజాశక్తి - రణస్థలం

మండలంలోని కమ్మసిగడాంలో ఎరువుల దుకాణంలో జిల్లా వ్యవసాయ అధికారి కె.త్రినాథరావు శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. బిల్ బుక్, స్టాక్ రిజిస్టర్‌ని తనిఖీ చేశారు. ఎరువులు నిల్వ, ధరల పట్టికని ప్రతిరోజూ అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు. ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రబీ సీజన్‌లో రణస్థలం మండలానికి 1100 టన్నుల యూరియాని కేటాయించామని, మరో విడత పంపిణీకి స్టాక్ త్వరలో వస్తుందన్నారు. వేల్పురాయిలో రైస్‌మిల్లుని తనిఖీ చేసి ధాన్యం కొనుగోలు ప్రక్రియను తనిఖీ చేశారు. మిల్లర్లు, రైతులకు ఎటువంటి ఇబ్బంది పెట్టకుండా కొనుగోలు సక్రమంగా సాగేలా చూడాలని ఆదేశించారు. రైతు సేవా కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి డి.విజయ భాస్కర్, విఎఎ ఎ.ప్రశాంత్, రైతులు పాల్గొన్నారు.

త్వరితగతిన సమీకృత కలెక్టరేట్ పనులు

వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

సమీకృత కలెక్టరేట్ భవన సముదాయ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ ఆవరణలో నూతనంగా నిర్మిస్తున్న సమీకృత కలెక్టరేట్ భవనాన్ని (ఐసిసి) కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ఆర్‌అండ్‌బి అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించి, భవనాల నిర్మాణ నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని మంత్రి అధికారులకు సూచించారు.

కార్యాలయంలో ఏర్పాటు చేయనున్న నమూనా ఏర్పాట్లను చూసి పలు సూచనలు చేశారు. ప్రవేశ ద్వారం, అంతర్గత రోడ్లు, గార్డెనింగ్ వంటి డిజైన్‌లు అధికారులను అడిగి తెలుసుకున్నారు. పార్కింగ్ స్థలం పక్కాగా ఉండాలన్నారు. మార్చి నాటికి భవనం పూర్తి చేయాలని ఆదేశించారు. త్వరితగతిన భవనంలో ప్రవేశించాలన్నారు. ప్రజలకు మెరుగైన సేవలందేలా మోడల్ కార్యాలయంగా తీర్చిదిద్దాలన్నారు. 84 ప్రభుత్వ విభాగాలను దృష్టిలో పెట్టుకొని కార్యాలయాలను కేటాయిస్తున్నట్లు అధికారులు వివరించారు. మొత్తం పనులు వేగవంతం చేసేలా అధికారులు, కాంట్రాక్టర్ పనిచేయాలని మంత్రి ఆదేశించారు.



భవనాలను పరిశీలిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం

- **115 హాట్‌స్పాట్లలో నిఘా నీడ**
- **మెడికల్ షాపులపై డ్రగ్ కంట్రోల్ నిఘా**
- **ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి**

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

మాదకద్రవ్యాల మహమ్మారిని రూపుమాపి, గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దుదామని ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి పిలుపునిచ్చారు. యువత భవిష్యత్‌ను కాపాడడమే లక్ష్యంగా అన్ని ప్రభుత్వ విభాగాలు సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన 'నార్కో కో-ఆర్డినేషన్ సెంటర్' (ఎన్కార్డ్) సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా 115 గంజాయి హాట్‌స్పాట్లను గుర్తించామని, ఈ ప్రాంతాల్లో వెంటనే సిసి కెమెరాలను ఏర్పాటు చేయాలని మున్సిపల్, పంచాయతీ అధికారులను ఆదేశించారు. నాగావళి తీర ప్రాంతాల్లో నిఘా కోసం ప్రత్యేకంగా కెమెరాలు అమర్చుతున్నామని, సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద 24 గంటల పాటు తనిఖీలు నిర్వహిస్తూ డ్రోన్లు, స్నిపర్ డాగ్స్ సాయంతో మారుమూల ప్రాంతాలను జల్లెడ పడుతున్నామని వెల్లడించారు.

మాదకద్రవ్యాల వినియోగంపై ఉక్కుపాదం మోపేందుకు పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు 'ట్రైనింగ్ ఆఫ్ ట్రైనర్స్'ద్వారా అవగాహన కల్పిస్తున్నామనివివరించారు. ప్రతి మండలం నుంచి ఎంపిక చేసిన 31 మంది మాస్టర్ ట్రైనర్లు యువతను చైతన్యపరుస్తారని, కాలేజీల్లో 'ఈగల్ క్లబ్'ల ద్వారా ప్రతి శనివారం సదస్సులు నిర్వహించాలని సూచించారు. మెడికల్ షాపుల్లో నిద్రమాత్రలు, మత్తు కలిగించే మందులను ప్రిస్క్రిప్షన్ లేకుండా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని డ్రగ్ కంట్రోల్ అధికారులను ఆదేశించారు. జిల్లా ఆసుపత్రిలో డీ-అడిక్షన్ సెంటర్‌ను బలోపేతం చేస్తున్నామని చెప్పారు. నవంబరులో జిల్లాలో 175 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని 14 మంది నిందితులను అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు. కేంద్ర రెవెన్యూ ఇంటిలిజెన్స్ డిప్యూటీ డైరెక్టర్ పూజారాణి పుండ్కర్ జిల్లాలో గంజాయి కట్టడికి తీసుకుంటున్న చర్యలపై నివేదికలు పరిశీలించారు. నేరగాళ్లు నూతన పంథాలో గంజాయి రవాణా చేస్తున్నారని ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

రోడ్డు ప్రమాదాల నివారణకు శాస్త్రీయ చర్యలు

జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు శాస్త్రీయ చర్యలు చేపట్టాలని ఎస్‌పి మహేశ్వర రెడ్డి అన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన రహదారి భద్రత కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రమాదాలు ఎక్కువగా సంభవిస్తున్న 'బ్లాక్ స్పాట్స్' వద్ద రక్షణ చర్యలు ముమ్మరం చేయాలని ఆదేశించారు. జిల్లాలో గత రెండేళ్లతో పోలిస్తే ఈ ఏడాది ప్రమాదాల సంఖ్య, ప్రాణ నష్టం కొంతమేర తగ్గుముఖం పట్టిందని తెలిపారు.

మితిమీరిన వేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, హెల్మెట్ ధరించకపోవడం వల్లే ఎక్కువ ప్రాణ నష్టం సంభవిస్తోందన్నారు. ప్రమాదకరమైన మలుపుల వద్ద ఆర్ అండ్ బి, నేషనల్ హైవే అధికారులు హెచ్చరిక బోర్డులు, బ్లింకర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. నవభారత్ జంక్షన్ వద్ద రోడ్డు విస్తరణకు ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. ఆర్‌టిసి బస్సులు రోడ్లపై ఎక్కడపడితే అక్కడ ప్రమాదకరంగా ఆపితే సీజ్ చేస్తామని హెచ్చరించారు. జనవరి నెలను రహదారి భద్రతా మాసంగా కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని, అందుకనుగుణంగా కార్యక్రమాలను రూపకల్పన చేస్తున్నామని చెప్పారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.వి లక్ష్మణమూర్తి, జిల్లా రవాణా అధికారి విజయసారథి, ఆర్‌అండ్‌బి ఎస్‌ఇ సత్యనారాయణ, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



తీర ప్రాంతాల్లో మెరైన్ ఇడి పర్యటన

ప్రజాశక్తి - సోంపేట

మండలంలోని ఎర్రముక్కాం, ఎకువూరు, బారువ తీరప్రాంత గ్రామాల్లో మెరైన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విమల్ రెవెన్యూ అధికారులతో కలిసి శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను పర్యటించిన తీర ప్రాంత గ్రామాల్లో ఎర్రముక్కాం, ఎకువూరు సముద్ర తీరం పర్యాటక కేంద్రంగా అభివృద్ధికి అనుకూలంగా ఉందన్నారు. ఇక్కడి తీరంలో సహజసిద్ధంగా ఉన్న నల్ల రాళ్లు ఆకట్టుకుంటున్నాయని తెలిపారు. బారువ తీరంలో ఇసుక దిబ్బలు ఉండడంతో పర్యాటకంగా అభివృద్ధికి అవకాశాలు తక్కువగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ ఉమామహేశ్వరరావు, మండల సర్వేయర్ నాగేశ్వరరావు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు జిల్లాస్థాయి ఓపెన్ చెస్ టోర్నీ

ప్రజాశక్తి - శ్రీకాకుళం


నగరంలోని స్కూల్ ఆఫ్ చెస్ అకాడమీలో ఈనెల 27వ తేదీన జిల్లా స్థాయి ఓపెన్ చెస్ పోటీలను నిర్వహించనున్నట్లు ఫిడే రేటింగ్ చెస్ ప్లేయర్, కోచ్ భేరి చిన్నారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఐదు రౌండ్ల పాటు నిర్వహించే ఈ పోటీల్లో పాల్గొనాలనుకునే వారు 9959118524 ఫోన్ నంబరును సంప్రదించాలని సూచించారు.

ఒడిదుడుకుల్లో వ్యవసాయం

- **వర్షాభావ పరిస్థితులతో లక్ష్యానికి చేరుకోని సాగు**
- **అన్నదాతలకు తప్పని యూరియా కష్టాలు**
- **ధాన్యం కొనుగోలులో రైతులకు తప్పని ఇబ్బందులు**
- **మారని కౌలు రైతుల దుస్థితి**



మొంథా తుపానుకు పలాసలో నీట మునిగిన వరిచేను (ఫైల్)



ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో ఈ ఏడాది ఒడిదుడుకుల మధ్యే వ్యవసాయం సాగింది. ఖరీఫ్ మొదటి రెండు నెలలూ వర్షాభావ పరిస్థితులే నెలకొన్నాయి. ఆగస్టు, సెప్టెంబరులో కాస్త వర్షాలు పడడంతో సాధారణ సాగుకు మించి రైతులు పంటలు వేయగలిగారు. అయితే ఈ సంవత్సరం అనుకున్న లక్ష్యానికి మాత్రం చేరుకోలేకపోయారు. వరుస అల్పపీడనాలు అన్నదాతలకు కొంత ఆందోళనకు గురిచేసినా పెద్దగా నష్టం కలిగించలేదు. అక్టోబరులో సంభవించిన మొంథా తుపాను మాత్రం కాస్త ప్రభావం చూపడంతో రైతులు కొంత నష్టపోయారు. జిల్లాలో గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి ఖరీఫ్ సీజన్‌లో తీవ్ర ఎరువుల కొరతను చవి చూశారు. ధాన్యం దిగుబడి అనుకున్నంత స్థాయిలో వచ్చినా కొనుగోళ్ల కోసం రైతులు ప్రతి ఏడాది మాదిరిగానే ఎదురుచూపులు చూడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి

జిల్లాలో ఖరీఫ్‌లో తొలి రెండు నెలలు వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో లక్ష్యం మేర పంటలు సాగు కాలేదు. అన్ని రకాల పంటలు కలిపి 4 లక్షల 58 వేల 618 ఎకరాలు సాగు లక్ష్యంగా నిర్దేశించుకోగా 4 లక్షల 20 వేల 163 ఎకరాల్లో పంటలు వేశారు. సాగునీటి కాలువల్లోకి నీటిని విడిచిపెడుతున్నా పూడిక, గుర్రపుడెక్క పేరుకుపోవడంతో శివారు భూములకు చేరలేదు. వర్షాల్లేక ఎండిపోతున్న పంటలను కాపాడుకునేందుకు రైతులు నానా పాట్లు పడ్డారు.

వరికి నామమాత్రంగా మద్దతు ధర పెంపు

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఈ ఏడాది ఖరీఫ్‌లో వరి పంటకు ప్రకటించిన ధర కంటితుడుపుగా ఉంది. ఎరువులు, పురుగు మందులు, డీజిల్, ఇతర యంత్ర పరికరాల రేట్లు, అద్దెలు ఒకవైపు పెరుగుతున్నా పంటలకు మద్దతు ధర పెంచేందుకు మనస్కరించడం లేదు. వరికి కేవలం క్వింటాకు రూ.69 మాత్రమే పెంచి చేతులు దులుపుకుంది. గతేడాది రూ.117 పెంచగా ఈసారి ఏకంగా రూ.48 తగ్గించింది.

10.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి

ఈ ఖరీఫ్ సీజన్‌లో 3,95,695 ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. ఈ ఏడాది 10.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. అందులో 6.50 లక్షల మెట్రిక్ టన్నులను కొనుగోలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ధాన్యం కొనుగోళ్లలో పాత కథే పునరావృతమవుతోంది. ధాన్యం తూకం, ధర చెల్లింపు విషయంలో వస్తున్న ఆరోపణల నేపథ్యంలో మిల్లర్లు తెర వెనుక ఉండి కథ నడిపిస్తున్నారు.

యూరియా తీవ్ర కొరత

జిల్లాలో పంటల సాగుకు అనుకూలంగా యూరియా పంపిణీ కాకపోవడంతో తీవ్ర డిమాండ్ ఏర్పడింది. రైతు సేవా కేంద్రాలకు వచ్చిన యూరియా గ్రామాల్లో పలుకుబడి ఉన్న నేతలు, వారి బంధువుల ఇళ్లకు చేరిపోయింది. యూరియా నిల్వలు నిండుకోవడంతో, రైతులు ప్రైవేట్ దుకాణాలను ఆశ్రయించాల్సి వచ్చింది.



భూమి పూజ చేస్తున్న విప్ అశోక్

రోగులకు మెరుగైన సేవలందించాలి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ప్రభుత్వం ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రి ద్వారా మెరుగైన వైద్య సేవలు అందించాలని గట్టి పట్టుదలతో ఉన్నామని ప్రభుత్వ విప్ డాక్టరు బెందాలం అశోక్ అన్నారు. శుక్రవారం ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రిలో రూ.42 లక్షలతో నిర్మిస్తున్న పోస్ట్‌మార్టం భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. అదేవిధంగా ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్య సదుపాయాలు కల్పిస్తున్న నేపథ్యంలో రూ.18 లక్షల విలువ గల ఆల్టర్ సౌండ్ మిషనరీను, పన్నెండు లక్షలతో కొత్తగా ఏర్పాటు చేసిన జనరేటర్‌ను ప్రారంభించారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ దేవేంద్ర రెడ్డికి సూచించారు. వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యం పనికిరాదని, వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అంతకు ముందు పట్టణంలో కొత్తగా ఏర్పాటు చేసిన టైమ్స్ టార్గెట్ టెక్నికల్ ఇన్స్టిట్యూట్ సెంటర్‌ను విప్ ప్రారంభించారు. కార్యక్రమంలో కార్పొరేషన్ చైర్మన్ కొండ శంకర్ రెడ్డి, జనసేన ఇన్‌ఛార్జి దాసరి రాజు, పట్టణ టిడిపి అధ్యక్ష, కార్యదర్శులు పత్రీ తవిటయ్య, నందిగాం కోటి, మండల అధ్యక్ష, కార్యదర్శులు లోపింటి పద్మనాభం, దక్కత కామేశ్వరరావు, కౌన్సిలర్‌లు లీలా రాణి, కాళ్ల దిలీప్ కుమార్, టిడిపి నేతలు సహదేవ్ రెడ్డి, దక్కత ఢిల్లీరావు, కృష్ణయ్య, సంతోష్, దట్టి శ్రీను, కొర్రయి ధర్మరాజు, ఎస్.శేఖర్, ప్రసాద్ ఆచారి పాల్గొన్నారు.



సిక్కోలు కళా జాతర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

12న సిక్కోలు కళా జాతర

ప్రజాశక్తి- సోంపేట

సిక్కోలు జానపద సాహిత్య కళావేదిక, రైతు సంఘం, ప్రజల సౌజన్యంతో జనవరి 12న రాజాంలో సిక్కోలు కళాజాతర నిర్వహిస్తున్నామని నిర్వహణ కమిటీ ప్రతినిధులు తెలిపారు. తెలంగాణ, ఒడిశా, చత్తీస్‌ఘడ్, ఆంధ్ర రాష్ట్రాల నుంచి పలువురు ప్రముఖ కళాకారులు వచ్చి ఉదయం ఏడు గంటల నుంచి రాత్రి పది గంటల వరకు జానపద కళాకారులచే ధూంధాం కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. రాజాం గ్రామ దేవత ఆలయ ప్రాంగణంలో పోస్టర్ ఆవిష్కరణను సిక్కోలు జానపద సాహిత్య కళావేదిక అధ్యక్షులు మామిడి కృష్ణారావు, కోశాధికారి గొరకల లోకేశ్వరరావు, గౌరవాధ్యక్షులు డాక్టర్ కుమార్ నాయక్, గౌరవ సలహాదారులు రాపాక ధనరాజు, దున్న రామారావు, మడియ వాసు, మచ్చ జోగారావు, తెప్పల అప్పారావు, రాజాం గ్రామ ప్రజల తరపున రైతు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఇటుకుల నాయుడు, గూడ తాతారావు, జుత్తు మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

ఐతమ్‌కు 'శిరో' గుర్తింపు కొనసాగింపు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి ఐతమ్ కళాశాలకు ఉన్న శాస్త్రీయ, పారిశ్రామిక పరిశోధనా సంస్థ (సైంటిఫిక్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ (శిరో) గుర్తింపును భారత ప్రభుత్వానికి చెందిన శాస్త్రీయ, పారిశ్రామిక పరిశోధన విభాగం 30 మార్చి 2028 వరకు పొడిగించినట్లు కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి నాగేశ్వరావు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ గుర్తింపు కొనసాగింపుతో ఐతమ్‌లో జరుగుతున్న శాస్త్రీయ పరిశోధనలు, పరిశ్రమలతో అనుసంధానమైన పరిశోధనా కార్యక్రమాలు, నూతన ఆవిష్కరణలకు మరింత ప్రోత్సాహం లభించనుందని తెలిపారు. అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు చేస్తున్న నాణ్యమైన పరిశోధనా కృషికి ఇది గుర్తింపుగా నిలుస్తుందన్నారు. ఈ గుర్తింపు కొనసాగడం వలన జాతీయ స్థాయిలో పరిశోధన ప్రాజెక్టులు, పరిశ్రమల సహకారం, ఆవిష్కరణల అభివృద్ధి, పరిశోధన నిధుల సాధనలో ఐతం కళాశాల మరింత ముందుకు సాగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా ఎ.ఎస్ శ్రీనివాసరావు, డీన్‌ఆర్‌అండ్ డి డా డి.శ్రీరాములు, డీన్ ఐ క్యు డా సి హెచ్. రమేష్, తదితరులు హర్షం వ్యక్తం చేశారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న సభ్యులు

పాలకమండలి ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి - గార

గార మండలం శాలిహుండం కొండపై వెలసిన కాళీయ మర్దన వేణుగోపాలస్వామి దేవాలయ నూతన పాలకమండలి సభ్యులు శుక్రవారం ఆలయ ప్రాంగణంలో ఎమ్మెల్యే గొండు శంకర్ ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఆలయ చరిత్రలో మొట్టమొదటిసారిగా ప్రభుత్వం కమిటీని నియమించగా, ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే గొండు శంకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి, యాత్రికులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు ఈ కమిటీ ఒక వారధిలా పనిచేయాలని ఆకాంక్షించారు. గతంలో ధర్మకర్తగా సుగ్గు మధురెడ్డి చేసిన సేవలను కొనియాడుతూనే, కొత్తగా బాధ్యతలు చేపట్టిన సభ్యులు ఆలయ సంప్రదాయాలను పాటిస్తూ క్షేత్రాన్ని మరింత ప్రగతి పథంలో నడిపించాలని సూచించారు. కార్యక్రమంలో ఆలయ ఇఒ, ధర్మకర్త మధురెడ్డి, స్థానిక కూటమి నాయకులు, గ్రామపెద్దలు, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

పేదలకు వరం సిఎం సహాయనిధి

శ్రీకాకుళం సిటీ: ముఖ్యమంత్రి సహాయనిధి పథకం నిరుపేదలకు వరంలా ఉపయోగపడుతుందని కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. నగరంలోని తన క్యాంపు కార్యాలయంలో సిఎం సహాయనిధి చెక్కులను బాధితులకు శుక్రవారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకున్న అర్హులకు ఆర్థిక సహాయం లభిస్తోందన్నారు. హిరమండలం మండలం గులుమూరుకు చెందిన సిగడాన ఆనందరావు తీవ్ర అనారోగ్యం పాలై కొద్దిరోజుల కిందట మృతి చెందారని, ఆస్పత్రి ఖర్చులు ఆర్థిక ఇబ్బందులు కుటుంబ సభ్యులు తనకు వివరించడంతో సిఎం సహాయనిధికి సిఫార్సు అందించినట్లు తెలిపారు. దీంతో ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం రూ.2,26,028 మంజూరు కాగా, చెక్కును బాధితురాలు అనసూయకు అందించినట్లు తెలిపారు. అపదలో ఉన్న వారిని సిఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆదుకుంటున్నట్లు చెప్పారు.



లబ్ధిదారునికి చెక్కు అందజేస్తున్న కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

ప్రభుత్వ లక్ష్యం నెరవేర్చాలి



ఆమదాలవలస : కార్యకర్తలకు ఫోన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

ప్రజాశక్తి- కవిటి

చిన్నారులు, గర్భిణులకు పౌష్టికాహారాన్ని అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం అంగన్వాడీలను బలోపేతం చేస్తోందని, దానిని గుర్తించి సిబ్బంది పనిచేయాలని ప్రభుత్వ విప్, ఇచ్చాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. మండలంలో 8 మినీ అంగన్వాడీలను ప్రధాన అంగన్వాడీలుగా మారుస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో విప్ అశోక్ సంబంధిత కార్యకర్తలకు ధ్రువీకరణ పత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారులు, గర్భిణుల కోసం ప్రభుత్వం అందిస్తున్న ప్రతి వస్తువు వారికి చేరవేయాలని, ప్రభుత్వ లక్ష్యాన్ని వారికి వివరించాలని విప్ సూచించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు పొందల కృష్ణారావు, కొండా శంకర్ రెడ్డి, సిడిపిఒ రాజ్యలక్ష్మి, సూపర్‌వైజర్లు పల్లవి, కృష్ణవేణి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆమదాలవలస: నియోజకవర్గంలోని 20 మినీ అంగన్వాడీ సెంటర్లు ప్రధాన అంగన్వాడీ సెంటర్లుగా మార్పు చెందిన సెంటర్ల అంగన్వాడీ కార్యకర్తలకు ఎమ్మెల్యే రవికుమార్ ఉత్తర్వులు అందించి వారితో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆమదాలవలస, బూర్జ, సరుబుజ్జిలి మండలాలకు చెందిన అంగన్వాడీ కార్యకర్తలకు 5జీ మొబైల్ ఫోన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా పార్లమెంటరీ పార్టీ అధ్యక్షుడు మొదలవలస రమేష్, రాష్ట్ర కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ తమ్మినేని గీత, పిఎసిఎస్ అధ్యక్షులు సిమ్మ మాధవి, టిడిపి నాయకులు సంపదరావు మురళి, గొండు రమణ, టిడిపి నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.



కవిటి : ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న విప్ అశోక్

ఇచ్ఛాపురం : స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో ఉన్న మినీ అంగన్వాడీ కేంద్రాలను మెయిన్ అంగన్వాడీ కేంద్రాలుగా అప్ గ్రేడ్ పత్రాలను ప్రభుత్వ విప్ డాక్టరు బెందలం అశోక్ చేతుల మీదుగా అందించారు. ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి రాజేశ్వరి ఆధ్వర్యంలో కొత్తగా అప్ గ్రేడ్ అయిన ఎనిమిది మినీ అంగన్వాడీ కేంద్రాలను అప్ గ్రేడ్ చేసిన పత్రాలను అందించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, సూపర్ వైజర్లు పాల్గొన్నారు.

పార్టీ అభివృద్ధికి కృషి చేస్తా

ప్రజాశక్తి- కొత్తూరు



అరుణకుమార్

టిడిపి అభివృద్ధికి కృషి చేస్తానని టిడిపి జిల్లా పార్లమెంట్ ఆర్గనైజింగ్ కార్యదర్శి అగతముడి అరుణకుమార్ అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తనపై నమ్మకంతో పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు జిల్లా కార్యదర్శిగా నియామకం చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, అచ్చెన్నాయుడుకు ధన్యవాదాలు తెలిపారు. గతంలో ఈయన పిఎసిఎస్ అధ్యక్షునిగా పని చేశారు. ఈయన తండ్రి అగతముడి బైరాగినాయుడు మండల పరిషత్ ఉపాధ్యక్షునిగా మూడు పర్యాయములు ఎన్నికయ్యారు. ప్రస్తుతం గురండి ఎంపిటిసిగా పనిచేస్తున్నారు.



సచివాయలంలో రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

సచివాలయం సందర్శన

నందిగాం: మండలంలోని దిమ్మిడిజోల గ్రామ సచివాలయాన్ని టెక్కలి డిఎల్‌పిఒ ఐ.వి రమణ, డిప్యూటీ ఎంపిడిఒ టి.హరికృష్ణ శుక్రవారం దిమ్మిడిజోల, దీనబందపురం గ్రామ సచివాలయాలను సందర్శించి ఇంటి పన్ను వసూలు, సచివాలయ రికార్డులు పరిశీలించారు. అనంతరం స్వామిత్వ మూడవ ఫేజ్‌లో భాగంగా నౌగాం రెవెన్యూ గ్రామంలో జరుగుతున్న స్వామిత్వ గ్రౌండ్ ట్రూథింగ్ ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సలాన నాగమ్మ, సర్పంచ్ ప్రతినిధి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకి ఇరువైపులా మట్టి వేయాలి

కొత్తూరు: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో సుమారు రూ.2 కోట్లుతో ప్రత్యేక భవన నిర్మాణ పనులు గుత్తేదారు చేపడుతున్నారు. ఈ భవన నిర్మాణం నుంచి ఆస్పత్రి ప్రధాన ద్వారం వరకు సుమారు 250 మీటర్లు సిమెంట్ రహదారి నిర్మాణం చేపట్టారు. రహదారికి ఇరువైపుల మట్టి వేయకపోవడంతో ఆటోలు, ఇతర వాహనాల్లో వచ్చే రోగులు వాహనాలు తిరగలేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు సమస్య పరిష్కరించాలని రోగులు కోరుతున్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీ పరిధిలోని 15వవార్డు దానంపేటలో ఇటీవలే గంట ప్రసాద్ అనే యువకుడు ఆకస్మిక మరణం చెందటంతో ఆ కుటుంబానికి ఉత్కళాంధ్ర ఇనిస్టిట్యూట్ తరుపున రూ.23 వేలు మృతుని తల్లి గంట రాజుకు అందించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ప్రతినిధి పిలక విజయ భాస్కర్ రెడ్డితో పాటు ఉత్కళాంధ్ర సభ్యులు జి.కృష్ణ, యు.కాళీ, అర్. పుణ్యవాసు, రఘు, జి.శ్రీను, సంతోష్ పాల్గొన్నారు.



రైల్వే లెవల్ క్రాసింగ్ వద్ద పరిశీలన చేస్తున్న నాయకులు, బాధితులు

ఆర్ఒబి అలైన్మెంట్ మార్చాలి

కంచిలి: మండలం జక్కర ఐసి గేట్ నంబర్ 341 వద్ద ఆర్ఒబి నిర్మాణం కొరకు రైల్వే అధికారు మార్కింగ్ చేయడం వలన జక్కర గ్రామంలో సుమారు 40 ఇళ్ల నష్టపోతున్నాయి. దీనిపై అధికారులు పున్ణ పరిశీలనచేసి, పేదలకు న్యాయం జరిగేలా చూడాలని కోరుతూ రైల్వే డివై చీఫ్ ఇంజనీరింగ్ ఆర్.ఎస్.పికి టిడిపి మండల అధ్యక్షుడు మాదిన రామారావు, బాధితులు కోరారు. ఈ మేరకు శుక్రవారం బాధితులతో కలిసి ఆర్ఒబి అలైన్మెంట్ స్థలాన్ని పరిశీలించారు. ఈ సమస్యను ఎమ్మెల్యే అశోక్, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు దృష్టికి తీసుకువెళ్లి, పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో జడ్ఆర్‌యుసిసి మెంబర్ శ్రీనివాస రౌలో, టి.వి.రమణ, చిన్నబాబు, మన్మథరావు, జక్కర గ్రామస్తులు పాల్గొన్నారు.

రేపు వికలాంగుల సమావేశం

టెక్కలి రూరల్: జిల్లా వికలాంగుల సమావేశం కాశీబుగ్గ కె.వి.ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఈనెల 28న ఆదివారం ఉదయం 9 గంటల నిర్వహించబడునని వికలాంగుల జిల్లా అధ్యక్షులు వేణుగోపాలరావు శుక్రవారం తెలిపారు. వికలాంగుల అంతర్జాతీయ దినోత్సవం సందర్భంగా పలాస కాశీబుగ్గ కె.వి.ఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తున్న సమావేశానికి జిల్లాలో ఉన్న వికలాంగులందరూ హాజరై విజయవంతంగా చేయాలని కోరారు.

రేపు విద్యుత్ సరఫరా నిలుపుదల

ఆమదాలవలస: మండలంలోని తొగరాం సబ్‌స్టేషన్ నందు ఆర్‌డిఎస్‌ఎస్, నూతన ఫీడర్ల ఏర్పాటు పనుల్లో భాగంగా ఈనెల 28న ఆదివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఎలక్ట్రికల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పైడి యోగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పనుల్లో భాగంగా ఆదివారం ఉదయం 8 గంటల నుంచి 2 గంటల వరకు తొగరాం, దూసిపేట, కోర్లకోట, జికెవలస, నిమ్మతొర్లాడ, పాతూరు, కొరపాం, హనుమంతుపురం, చీమలవలస, పీరుసాహెబ్ పేట, కలివరం, తమ్మయ్యపేట గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపి వేయబడునన్నారు. విద్యుత్ వినియోగదారులు తమ సిబ్బందికి సహకరించాలని కోరారు.

డ్రగ్స్ వద్దు.. మంచి నడవడిక ముద్దు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

డ్రగ్స్ వద్దు మంచి నడవడిక ముద్దు అని ఎపి ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు అన్నారు. శుక్రవారం పూండి సాయి వినీత్ విద్యా సంస్థల ఆవరణలో కాశీబుగ్గ రూరల్ సిఐ తిరుపతి ఆధ్వర్యంలో నిర్వహించిన డ్రగ్స్ వద్దు బ్రో అనే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్స్ మహమ్మారి యువత జీవితాలు ఎలా నాశనం చేస్తుందో తెలియజేస్తూ ప్రజలను అవగాహన పరుస్తూ పాయకరావుపేట నుంచి ఇచ్ఛాపురం వరకు సాగుతున్న అభ్యుదయం సైకిల్‌యాత్ర పూండి చేరుకున్న సందర్భంగా సమావేశం నిర్వహించారు. సమావేశం అనంతరం పూండి బస్ స్టాండ్‌లో ర్యాలీ నిర్వహించారు. డ్రగ్స్ వద్దు బ్రో అంటూ విద్యార్థులు, నాయకులు పెద్దఎత్తున నినాదాలు చేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. కార్యక్రమంలో రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పుచ్చ ఈశ్వరరావు, సాయి వినీత్ విద్యా సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ లీలా, ఎస్ఐ నిహార్, ప్రిన్సిపాల్ అన్నేపు కైలాసరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ విఠల్ నాయకులు, దువ్వాడ హేమబాబు చౌదరి, దున్న షణ్ముఖారావు తదితరులు పాల్గొన్నారు.



సైకిల్‌యాత్రలో పాల్గొన్న విద్యార్థులు, నాయకులు

ప్రభుత్వ భూమి ప్రైవేట్ పాఠశాలకు అప్పగించడంపై ఫిర్యాదు



వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్, గ్రామస్తులు

ప్రజాశక్తి- రణస్థలం

అత్యవసర ప్రజా అవసరాలు ఉన్నప్పటికీ, ప్రభుత్వ భూమిని ఒక ప్రైవేట్ పాఠశాలకు అప్పగించడంపై స్థానిక రెవెన్యూ అధికారులకు జె.ఆర్.పురం సర్పంచ్ బవిరి రమణ, గ్రామ పెద్దలు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జె.ఆర్ పురం గ్రామం, సర్వే నెం. 66/27,31,32 వద్ద ఉన్న 27 సెంట్లు ఒక గయ్యాలు (ప్రభుత్వ) భూమిని ఒక ప్రైవేట్ పాఠశాల (సూర్య స్కూల్) యాజమాన్యానికి అప్పగించడానికి రెవెన్యూ అధికారులు ప్రతిపాదించినట్లుగా దృష్టికి రావడంతో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. సదరు భూమి సామాజిక సంక్షేమం కోసం ఉద్దేశించిన ప్రభుత్వ భూమి అని, ఈ భూమికి అనేక అత్యవసర ప్రజా అవసరాలు ఉన్నందున, ఈ నిర్ణయంపై గ్రామస్తులు తీవ్ర ఆందోళన చెందు తున్నారన్నారు. స్థానిక రైతులు, వ్యాపారులకు మద్దతుగా కూరగాయల మార్కెట్ యార్డ్ ఏర్పాటు, జె.ఆర్.పురంలో చాలా స్కూల్స్, కాలేజీలు, ఎందరో విద్యార్థులు కాంపిటేషన్ ఎగ్జామ్స్‌కి ప్రిపేర్ అవడానికి యువత కోసం పబ్లిక్ లైబ్రరీ నిర్మాణం కోసం, ప్రజల నిత్యవసర తాగునీరు కోసం వాటర్ ట్యాంకులు, జల్ జీవన్ మిషన్, అత్యవసర 108 అంబులెన్స్‌కు సరైన స్థలం లేనందున ఆ వాహనం నిలుపుటకు స్థలం, అవసరమైన ప్రభుత్వ, ప్రజా వినియోగ సేవలు అందించే కొన్ని ప్రభుత్వ కార్యాలయాలకు స్థలాలు లేక అద్దె భవనాల్లో ఉన్నాయని వాటి నిర్మాణం చేయడానికి ఈస్థలం ఉపయోగపడుతుందన్నారు. సుమారుగా రూ.3 నుంచి రూ.4 కోట్లు విలువైన ప్రభుత్వ భూమిని ఒక ప్రైవేట్ స్కూల్‌కు అప్పగించడం వల్ల సాధారణ ప్రజలు దీర్ఘకాలిక ప్రయోజనాలు కోల్పోతారని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ ప్రభుత్వ భూమిని ఏ ప్రైవేట్ సంస్థకు బదిలీ చేయడాన్ని, కేటాయించడాన్ని తక్షణమే నిలిపివేయాలని, ఈ విషయంపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. స్థానిక ప్రతినిధులు, గ్రామస్తులతో సంప్రదించి, భూమిని కేవలం ప్రజా వినియోగాల మాత్రమే కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

ప్రజాశక్తి- ఆమదాలవలస

ప్రజల సమస్యల పరిష్కారమే ప్రజాదర్బార్ లక్ష్యమని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని టిడిపి కార్యాలయం వద్ద నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో హాజరైన ప్రజలు తమ వ్యక్తిగత, సామూహిక సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలను విని వాటిని పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. తాగునీరు, పారిశుధ్యం, రహదారులు, విద్యుత్ సరఫరా, పింఛన్లు, గృహ నిర్మాణం వంటి ప్రజా సమస్యలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. కార్యక్రమంలో జిల్లా పార్లమెంటరీ పార్టీ అధ్యక్షుడు మొదలవలస రమేష్, రాష్ట్ర కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ తమ్మినేని గీత, పిఎసిఎస్ అధ్యక్షులు సిమ్మ మాధవి, టిడిపి నాయకులు సంపదరావు మురళి, గొండు రమణ, టిడిపి నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.



పోలాకి : వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

పోలాకి: మండలం కత్తిరివానిపేట క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ప్రజాదర్బార్ నిర్వహించి, ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. నియోజకవర్గ నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు తమ వ్యక్తిగత సమస్యలను, గ్రామాల సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గంజాయి రవాణాపై ప్రత్యేక దృష్టి

డిఎస్‌పి షేక్ షాహబాజ్ అహ్మద్

ప్రజాశక్తి- పలాస



షేక్ షాహబాజ్ అహ్మద్, డిఎస్‌పి

కాశీబుగ్గ డివిజన్ ప్రాంతంలో ఎక్కువగా ఒడిశా సరిహద్దులు ఉండడం వల్ల గంజాయి అక్రమ రవాణాకు ఎక్కువుగా అవకాశాలు ఉన్నాయని, గంజాయి అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారించి గంజాయి నిర్మూలనకు చర్యలు చేపడతానని కాశీబుగ్గ డిఎస్‌పి షేక్ షాహబాజ్ అహ్మద్ అన్నారు. కాశీబుగ్గ డిఎస్‌పి కార్యాలయంలో శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ తాను గతంలో పాడేరు డిఎస్‌పిగా విధులు నిర్వహించానని కాశీబుగ్గ డిఎస్‌పిగా బాధ్యతలు స్వీకరించడం సంతోషంగా ఉందన్నారు. డివిజన్ పరిధిలో చిన్నచిన్న సమస్యలు ఉన్నాయని, జిల్లా ఎస్‌పి, స్థానిక సిఐలు, ఎస్ఐల సహకారంతో శాంతిభద్రతలు కాపాడే విధంగా తగుచర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఇచ్ఛాపురం నుంచి కాశీబుగ్గ వరకు నేషనల్ హైవే ఉందని అందువల్ల రోడ్డు భద్రత కోసం ప్రత్యేక చర్యలు చేపడతామన్నారు. చోరీ కేసులు కూడా ఈ ప్రాంతంలో ఎక్కువుగా జరుగుతున్నట్లు తెలుస్తుందని, ఎక్కడికక్కడ సిసి కెమేరాలు ఏర్పాటు చేసి చోరీల నివారణకు చర్యలు చేపడతామన్నారు. మహిళా భద్రతకోసం నారీశక్తి వంటి కార్యక్రమాలు చేపడుతున్నారని, దీనిని మరింత విస్తృతం చేస్తామన్నారు. సబ్ డివిజన్ పరిధిలో రౌడీషీటర్లు, అనుమానితులపై ప్రత్యేక దృష్టి సారించి వారి కదలికలను గుర్తించి ఎటువంటి నేరాలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. కాశీబుగ్గ డిఎస్‌పిగా తనకు బాధ్యతలు అప్పగించిన డిజిపి, డిఐజి, జిల్లా ఎస్‌పిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

బందపల్లి ఘటనపై చర్యలు తీసుకోవాలి

టెక్కలి: మెళియాపుట్టి మండలం బందపల్లి గిరిజన బాలికల పాఠశాలలో గిరిజన బాలికపై దొంగతనం నేరం మోపి తీవ్రంగా కొట్టిన పాఠశాల పీడీ భర్తపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిట్ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని, పీడీని ఉద్యోగం నుంచి తొలిగించాలని, సంఘటనకు మూలకారకుడైన మెళియపుట్టి ఎటిడబ్ల్యూఒను సస్పెండ్ చేయాలని దళిత ప్రజా సంఘాల ఐక్యవేదిక డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక అంబేద్కర్ జంక్షన్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. గర్ల్ స్కూల్‌లో మగవారికి ప్రవేశం లేదని, అక్కడ పనిచేస్తున్న పురుష ఉపాధ్యాయులకు రాత్రిపూట ఉండే అవకాశం లేదని, పీడీ భర్త బందపల్లి గర్ల్స్ స్కూల్‌నే నివాసం ఉండే అవకాశం జువైనల్ జస్టిస్ కమిటీ ఆదేశాలకు భిన్నంగా అక్కడ హెచ్‌ఎం, మెళియపుట్టి ఎటిడబ్ల్యూఒ ఎలా అవకాశం ఇచ్చారని, దళిత ప్రజా సంఘాల ఐక్యవేదిక ప్రశ్నించింది. పీడీ భర్త గిరిజన బాలికపై నేరం మోపి తీవ్రంగా కొట్టడం దారుణమైన విషయమని, ఈ విషయం హెచ్‌ఎం, ఎటిడబ్ల్యూఒకు తెలిసినప్పటికీ ఉన్నతాధికారులకు తెలియ జేయలేదని, ఎటిడబ్ల్యూఒ ఒత్తిడి వల్ల పీడీని పీడీ భర్తను కాపాడడం జరిగిందన్నారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కుల నిర్మూలన పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు బెలమర ప్రభాకరరావు, డిటిఎఫ్ గౌరవ అధ్యక్షుడు కోత ధర్మారావు, గొడగల సంక్షేమ సంఘం రాము, పారిశుధ్య కార్మికులు, నాయకులు శివ, రాజు డిమాండ్ చేశారు. ప్రాజెక్ట్ ఆఫీసర్, జిల్లా కలెక్టర్ వెంటనే కలుగు చేసికొని ఆదివాసీ బాలికలను కాపాడాలని కోరారు.

బస్సు సౌకర్యం కల్పించాలని వినతి

ప్రజాశక్తి- కవిటి

జాడుపూడి మీదుగా దూగానపుట్టుగ, బి.గొనపపుట్టుగ, నర్తుపుట్టుగ, శ్రీరాంపురం వయా సోంపేట వరకు బస్సు సౌకర్యం కల్పించాలని కూటమి నాయకులు కోరారు. ఈ మేరకు పలాస ఆర్‌టిసి డిపో మేనేజర్ శ్యాంప్రసాద్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఇచ్ఛాపురం ఎఎంసి చైర్మన్ మణిచంద్ర ప్రకాష్, జెడ్ఆర్‌యూసిసి సభ్యుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎన్నోఏళ్లుగా బస్సు సౌకర్యం లేక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డా. బెందాళం అశోక్ ఆదేశాల మేరకు ఈ వినతి అందించినట్లు పేర్కొన్నారు. దీనిపై బస్సు నిలయం బాధ్యుడు సానుకూలంగా స్పందించి, త్వరలో బస్సు సౌకర్యం కల్పిస్తామని హామీఇచ్చారు. కార్యక్రమంలో కవిటి మండలం జనసేన ఉపాధ్యక్షుడు లోళ్ల సాగర్, జిల్లా కార్యక్రమ సంఘ సభ్యుడు దూగాన దివాకర్, పిఎసిఎస్ డైరెక్టర్ రాజశేఖర్, బంజు మనోజ్, దూగాన సిసింద్రీ, హోమాచలపతి, దూగాన భాస్కర్ పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు



తండ్రి మృతదేహానికి తలకొరివి పెడుతున్న కుమార్తె

తండ్రికి కుమార్తె తలకొరివి

ప్రజాశక్తి- బూర్జ

తండ్రి మృతిచెందడంతో కన్నీమున్నీరైన కుమార్తెలు చివరకు తోడబుట్టిన వాడు లేకపోవడంతో కన్నతండ్రికి తలకొరివి పెట్టడం గ్రామస్తులకు కంట తడి పెట్టించింది. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కొరగాం గ్రామానికి చెందిన బొడ్డారు శివయ్య (63) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. తండ్రి మృతి చెందిన వార్త తెలుసుకున్న కుమార్తెలు ధనలక్ష్మి, రాజులు బోరున విలపించారు. శివయ్యకు కుమారులు లేకపోవడంతో ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో గ్రామస్తులున్నారు. అయితే తన తండ్రికి తామే తలకొరివి పెడతామని కుమార్తెలు ముందుకు వచ్చారు. తన తండ్రి రుణం ఈ విధంగానైనా తీర్చుకుంటామని గ్రామస్తులకు సర్దిచెప్పారు. కొడుకైనా, కూతుళ్లయినా వారి కావడంతో గ్రామస్తులు అంగీకరించారు. దీంతో శివయ్యకు కుమార్తెలు తలకొరివి పెట్టారు. ఈ సంఘటన గ్రామస్తులను కలచివేసింది.

తల్లి, కుమార్తె అదృశ్యం



కనిపించని తల్లి కూతురు

సోంపేట: మండ లం కొర్లాం గ్రామానికి చెందిన జోరామణి మహా పాత్రో నాలుగేళ్ల కూతురుతో పాటు ఈనెల 18 నుంచి కనబడటం లేదని కుటుంబ సభ్యులు తెలిపారు. గత కొంతకాలంగా జోరామణికి మతిస్థిమితం సరిగా లేదని, ప్రస్తుతం ఆమె ఆరు నెలల గర్భిణి అని తండ్రి నరసింగ మహాపాత్రో తెలి పారు. ఆచూకీ తెలిసినవారు 9989136105 నంబర్‌కు సమాచారం ఇచ్చి సహకరించాలని కోరారు.

విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

బెండి ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు యుటిఎఫ్ ప్రచురిత మోడల్ పేపర్లను కణితి నారాయణరావు సౌజన్యంతో శుక్రవారం పంపిణీ చేశారు. పాఠశాల ఇన్‌ఛార్జి హెచ్‌ఎం నాగభూషనరావు మాట్లాడుతూ పదో తరగతి ఫైనల్ పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించడానికి ఈ పుస్తకం ఒక ఆయుధంగా ఉపయోగపడుతుందని అన్నారు. పుస్తకాలు అందించిన కణితి నారాయణరావుకు మండల యుటిఎఫ్ శాఖకు ధన్యవాదములు తెలియజేశారు. యుటిఎఫ్ జిల్లా నాయకులు దువ్వాడ జనార్ధనరావు మాట్లాడుతూ చక్కటి ప్రణాళికతో తయారు చేసిన మెటీరియల్ పరీక్షను ఏ విధంగా రాయాలి అని తెలియజేసే చక్కటి మార్గదర్శిని అన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు తుంగాన మోహనరావు, తుంగన తిరుపతిరావు, కంచరాన జయరామ్ తదితరులు పాల్గొన్నారు.



తంగివానిపేటలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే శంకర్

తంగివానిపేట అభివృద్ధికి చర్యలు

శ్రీకాకుళం రూరల్: నగర కార్పొరేషన్ పరిధిలోని పెదపాడులోని తంగివానిపేట అభివృద్ధికి కృషి చేస్తామని ఎమ్మెల్యే గొండు శంకర్ పేర్కొన్నారు. తంగివానిపేటలో శుక్రవారం కూటమి నాయకులతో కలిసి ఎమ్మెల్యే విస్తృ తంగా పర్యటించి, స్థానిక సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామంలోని ప్రతివీధిలో తిరిగి ప్రజల అవసరాలను అడిగి తెలుసుకున్నారు. మురుగునీటి పారుదల వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటంపై గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. డ్రైనేజీల నిర్మాణం, అంతర్గత రహదారుల పునరుద్ధరణ, తాగునీటి ఎద్దడి నివారణ, విద్యుత్ లైన్ల సరిదిద్దడం, పరిసరాల పరిశుభ్రత వంటి ప్రధానాంశాలపై స్థానికులు విన్నవి ంచారు. సమస్యలపై స్పందించిన ఎమ్మెల్యే వెంటనే మున్సిపల్ అధికారులతో మాట్లాడారు. గ్రామంలో అవసరమైన అభివృద్ధి పనులకు సంబంధించి వెంటనే అంచనాలు సిద్ధం చేయాలని, టెండర్ల ప్రక్రి యను వేగవంతం చేసి పనులు ప్రారంభించాల న్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, నాయ కులు, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

వార్డుల్లో మౌలిక సదుపాయాలు కల్పన

పలాస : వార్డుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు చేపడుతున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఇ.శ్రీనివాసులు అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని శివాజీ నగర్‌లో శుక్రవారం కమిషనర్ పర్యటించారు. ఇటీవల ఈ ప్రాంతంలో రోడ్డు శంకుస్థాపనకు ఎమ్మెల్యే గౌతు శిరీష రావడంతో మిగిలిన వీధుల్లో రోడ్లు లేవని ప్రజలంతా ఎమ్మెల్యేకు విన్నవించారు. వీధి ఏర్పడి 25 ఏళ్ళైనా ఇప్పటివరకు సిసిరోడ్లు ఏర్పాటు కాలేదని, కనీసం మీహయాంలోనైనా తమకు సిసిరోడ్లు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ మేరకు స్పందించిన ఎమ్మెల్యే ఆయా రోడ్లను పరిశీలించి నివేదిక ఇవ్వాలని కోరడంతో కమీషనర్, ఎమ్మెల్యే పిఎ ఎ.శ్రావణ్ 20వ వార్డుల్లో పలు రహదారులను పరిశీలించారు. అదే విధంగా ఏ రహదారి ఎంత పొడవు, వెడల్పు ఉంది కొలతలు తీసి ఆయా రోడ్డుకు ఎంత నిధులు అవసరం ఉందనే విధంగా నివేదిక తయారు చేసేందుకు సిద్ధం చేస్తున్నారు. ఈ పరిశీలనలో మున్సిపల్ సిబ్బందితో పాటు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరానికి స్పందన

కోటబొమ్మాళి: పశుగణాభివృద్ధి సంఘం, రిలయన్స్ ఫౌండేషన్ సౌజన్యంతో తిలారు పశు వైద్యాధికారి డా.మెండ ప్రజ్ఞ చైతన్య ఆధ్వర్యంలో మండలం అక్కయ్యవలసలో ఉచిత పశు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. నిమ్మాడ పశు వైద్యాధికారి డా.కిరణ్ కుమార్ లఖినేని, పశుగణాభివృద్ధి సంఘం పశువైద్యాధికారి డా.పేడాడ పద్మావతి ఆధ్వర్యంలో 24 దూడలకు నట్టల నివారణ మందులు, 43 పశువుల్లో గర్భకోశ వ్యాధులకు చికిత్సను అందించారు. కార్యక్రమంలో మండల పశువైద్య సిబ్బంది, ప్రజాప్రతినిధులు ఇట్రాజుల అసిరితాత, కర్రెన్న, సోములు, భాస్కరరావు, సింహాలు, గంగులు, సూర్యనారాయణ, ఆనంద్, గడ్డెన్న, పాడి రైతులు, రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధులు జి.తిరుమలరావు, బి.లక్ష్మణరావులు పాల్గొన్నారు.


రైతులకు అవగాహన కల్పిస్తున్న అమరేశ్వరి తదితరులు

పామాయిల్ సాగుతో లాభాలు

ప్రజాశక్తి- లావేరు

రైతులు పామాయిల్ పంటను సాగు చేయాలని, అధిక లాభాలు వస్తాయని ఉద్యానవన శాఖాధికారి అమరేశ్వరి అన్నారు. మండలంలోని గుమ్మాడం పంచాయతీ నాగంపాళెంలో శుక్రవారం ఉద్యనవన పంటల సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పామాయిల్ పంట తక్కువ పెట్టుబడి అత్యధిక లాభాలు వస్తున్నాయని, అందరూ ఈ సాగుపై దృష్టి సారించాలన్నారు. ప్రభుత్వం రాయితీ ఇస్తుందని, మొక్కలు ఉచితంగా అందజేయడం జరుగుతుందన్నారు. ప్రతీనెల పంట కోత అయిన తర్వాత రైతులు ఖాతాల్లో నగదు జమ అవుతుందని చెప్పారు. టిడిపి నాయకులు మజ్జి రామమూర్తి మాట్లాడుతూ గ్రామంలోని రైతులు విభిన్న రకాల పంటలు ఇప్పటికే పండిస్తున్నారని, ఇకనుంచి ఉద్యానవన పంటలు బొప్పాయి, పామ్ఆయిల్ అరటి కాయగూరలు, పూలతోటలు వంటివి సాగుచేస్తే మంచి లాభాలు సాధించవచ్చునన్నారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ లిఖిత, మాజీ సర్పంచ్ మజ్జి సత్యం, రైతులు జగ్గారోతు రమణ, నూకరాజు, గొర్లె రామస్వామి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.


రహదారి పనులు ప్రారంభిస్తున్న రామారావు

రహదారి పనులు ప్రారంభం

ప్రజాశక్తి- కంచిలి

మండలంలోని మఠం సరియపల్లిలో టిడిపి మండల అధ్యక్షుడు మాదిన రామారావు నూతన రహదారి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని నెయ్యిలవీధి నుంచి అధికారి చెరువు వరకు గల 300 మీటర్ల రహదారి పనులను రూ.11 లక్షలతో పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. ఏళ్ల తరబడి గ్రామంలో సరైన రహదారి సౌకర్యాలు లేక ప్రజలు పడుతున్న ఇబ్బందులను ప్రభుత్వ విప్ అశోక్ దృష్టికి తీసుకువెళ్లి నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. కూటమి నాయకుల ఆధ్వర్యంలో పనులు త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు భాస్కర్ రెడ్డి, కిషోర్ పాడి, పురుషోత్తం, రామారావు, టి.వి.రమణ, సూర్య నారాయణ, శ్రీకాంత్, వంశీ, మనీ, రమేష్, బైరేగి రెడ్డి, కృష్ణమూర్తి, సోమేష్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

'స్వామిత్వ'ను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలం మర్రిపాడు సి పంచాయతీ పరిధిలో ప్రభుత్వం చేపడుతున్న స్వామిత్వ కార్యక్రమాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ ప్రతినిధి రవ్వల గణపతి రావు శుక్రవారం కోరారు. పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ఆదేశాల మేరకు సర్పంచ్ ఆధ్వర్యంలో సంబంధిత అధికారులు గ్రామానికి వచ్చి ప్రతి ఇంటి స్థలం, ఇంటిని కొలతలు వేసి ఇంటి యజమానులకు హక్కు పత్రాలు మంజూరు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా గణపతిరావు మాట్లాడుతూ ప్రభుత్వం యజమాన్య హక్కు పత్రాలు అందించడం వల్ల ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని, ఇంటికి, ఆస్తికి భరోసా కలుగుతుందన్నారు. అధికారులు గ్రామానికి వచ్చినప్పుడు ప్రతిఒక్కరూ తమ స్థలాలను చూపించి, సరిగా కొలిపించుకొని, హద్దులు నిర్ధారించుకొని ఈ హక్కు పత్రాలను ఉచితంగా పొందాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి ధనలక్ష్మి, డిఎ ఉపేంద్ర, సవరమర్రిపాడు మాజీ సర్పంచ్ అబ్బాయి సంజీవ్, చిన్నారావు, హేమ తదితరులు పాల్గొన్నారు.

పాత్రికేయుల సంక్షేమానికి కృషి

ప్రజాశక్తి- ఆమదాలవలస

పాత్రికేయుల సంక్షేమానికి తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ప్రింట్ మీడియా ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో పాత్రికేయులు ఎమ్మెల్యే రవికుమార్‌ను కలిసి ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో పాత్రికేయుల పాత్ర అత్యంత కీలకమని, పాత్రికేయుల సంక్షేమానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, తాను కూడా పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షుడు మొదలవలస రమేష్, రాష్ట్ర కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్, మున్సిపల్ మాజీ చైర్పర్సన్ తమ్మినేని గీత, పిఎసిఎస్ అధ్యక్షులు శిమ్మ మాధవి, మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, మార్క్‌ఫెడ్ రాష్ట్ర డైరెక్టర్ ఆనెపు


ఎమ్మెల్యే రవికుమార్‌ను సన్మానిస్తున్న పాత్రికేయులు

రామకృష్ణ, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు జి. రమణారావు, ఉపాధ్యక్షుడు తాండ్ర అప్పలనాయుడు, కార్యదర్శి అన్నెపు మోహనరావు, కోశాధికారి ఐన్యూస్ వాసు, గౌరవ అధ్యక్షుడు జి.ప్రసాదరావు, పాత్రికేయులు కె.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రెస్‌క్లబ్ కార్యవర్గానికి సన్మానం

నూతనంగా ఎన్నికైన ప్రింట్ మీడియా ప్రెస్‌క్లబ్ కార్యవర్గానికి కూటమి నాయకులు చిరు సత్కారాన్ని నిర్వహించారు. శుక్రవారం పట్టణంలోని సీతారామ కళ్యాణ మండపం వద్ద జరిగిన కార్యక్రమంలో కూటమి సీనియర్ నాయకులు పాతిన గడ్డయ్య, బొడ్డేపల్లి చినబాబు, గురుగుబెల్లి వెంకటరావు ఆధ్వర్యంలో నూతన అధ్యక్షులు గురుగుబెల్లి రమణారావు, కార్యదర్శి అన్నెపు మోహనరావు, కోశాధికారి ఐ న్యూస్ వాసు, గౌరవ అధ్యక్షుడు గురుగుబెల్లి ప్రసాదరావులను సన్మానించారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు మాట్లాడుతూ పాత్రికేయులు నిత్యశ్రామికులని, పాత్రికేయుల సేవలు వెల కట్టలేని వని కొనియాడారు. పాత్రికేయులకు తమవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. కార్యక్రమంలో అన్నెపు ధనుంజయరావు, తాతన్నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆపత్కాలంలో... ఆ నలుగురు

కవిటి: నేటి సమాజంలో మానవత్వం ఇంకా బతికే ఉందని చెప్పే సంఘటనలు అరుదుగా కనిపిస్తున్నాయి. అలాంటి అరుదైన కోవకే ఈ సంఘటన చెందుతుంది. ఆపదలో ఉన్న ఓ కుటుంబాన్ని చూసి ఊరుకోకుండా, అండగా నిలిచిన నలుగురు వ్యక్తులు ఆదర్శంగా నిలిచారు. ఇటీవల చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు మృతి చెందిన కొత్తపాలెం గ్రామానికి చెందిన కర్రి విశ్వనాథం కుటుంబానికి పాండవ తారకేశ్వరరావు, బైపిల్లి మోహనరావు, ముత్తి కాశీరావు, ఉప్పాడ తులసయ్య అండగా నిలిచారు. ఇద్దరు చిన్నారులతో దిక్కులేని స్థితిలో ఉన్న విశ్వనాథం భార్య ఈశ్వరిని కలిసి ఓదార్చిన వారు, అధైర్య పడొద్దు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అంతేకాకుండా తమవంతుగా రూ.50 వేల ఆర్థికసాయం అందజేశారు. ఇంటిదిక్కును కోల్పోయి నిస్సహాయ స్థితిలో ఉన్న కుటుంబానికి అండగా నిలిచి, మానవత్వాన్ని చాటిన ఈ నలుగురు పలువురికి ఆదర్శంగా నిలిచారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆత్మీయ సదస్సు విజయవంతం చేయాలి

టెక్కలి రూరల్ : నియోజకవర్గంలో ఉన్న కళింగులు కళింగ వనభోజనాలను విజయవంతం చేయాలని టెక్కలి వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ పిలుపునిచ్చారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ఈనెల 28న ఎచ్చెర్లలో జరగనున్న కాళింగ ఆత్మీయ కలయికను జయప్రదం చేయాలన్నారు. నందిగాం ఎంపిపి శ్రీరామ్మూర్తి, హేమసుందరరాజు, సత్యరాజు పాల్గొన్నారు.

ఆమదాలవలస: కళింగుల ఆత్మీయ సదస్సును ఈనెల 28న నిర్వహించనున్న కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని ఉత్తరాంధ్ర కళింగ సంఘ నాయకుడు పేడాడ జనార్ధనరావు పిలుపునిచ్చారు.

కవిటిలో వీర్‌బాల్ దినోత్సవం

ప్రజాశక్తి- కవిటి

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం వీర్‌బాల్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ పి.హరి మాట్లాడుతూ పదో సిక్కు గురువు గురు గోవింద్ సింగ్ కుమారులు సాహిబ్జాదా సింగ్, జోరావర్ సింగ్ ఔరంగజేబుకు వ్యతిరేకంగా పోరాడి ప్రాణత్యాగం చేసిన ధైర్యశాలి బాలలని తెలిపారు. వారి త్యాగానికి గుర్తుగా ప్రతి సంవత్సరం డిసెంబర్ 26న వీర్‌బాల్ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. బాలవీరుల శౌర్యం యువతరానికి స్ఫూర్తని పేర్కొన్నారు. అంతకుముందు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వీర్ బాల్ కార్యక్రమాన్ని విద్యార్థులకు ప్రత్యక్షంగా ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పిఒ జె.పాపారావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు

ఇచ్ఛాపురం : శాంతినికేతన్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో ఘనంగా వీర్‌బాల దివాస్ నిర్వహించారు.


కవిటి : తిలకిస్తున్న విద్యార్థులు

ఈ సభకు స్కూల్ చైర్మన్ డి.కృష్ణమూర్తి రెడ్డి అధ్యక్షత వహించారు. వీర్‌బాల దివాస్ సందర్భంగా స్కూల్ విద్యార్థినులకు చిత్ర లేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు కృష్ణమూర్తి రెడ్డి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మేనేజర్ కె.సి.పూరి, ఉపాధ్యాయులు సురేఖ, పద్మజ, శాంతి, రవి, జయలక్ష్మి, మీనా, పార్వతి, స్నేహ, సరోజిని, ప్రమీల, శిరీష, జీహారిక, యువశ్రీ ఇంటరాక్ట్ క్లబ్ ప్రెసిడెంట్ మోహన్ ప్రియా, సెక్రటరీ డి.హర్షవర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.



కేన్సర్ వైద్య నిపుణులను సత్కరిస్తున్న ఆర్ఎంపి వైద్యులు

అవగాహనతో కేన్సర్ తరిమికొట్టాలి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్లు కారణంగా సోకుతున్న కేన్సర్ మహామ్మారిని అవగాహనతో తమిరికొట్టాలని మహాత్మా గాంధీ కేన్సర్ ఆస్పత్రి కేన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ సత్యవిజయ్ అన్నారు. శుక్రవారం మండలంలోని పూండిలో కేన్సర్ మహమ్మారిపై గ్రామీణ వైద్యులకు (ఆర్ఎంపి) అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రజలకు ఆరోగ్య సూచనలు, ప్రాథమిక వైద్యం, సలహాలు, సూచనలు చేయడంలో ఆర్ఎంపిలు కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. కేన్సర్ వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తించి వైద్యం అందిస్తే ఎంతో మంచిదని, ప్రాథమిక లక్షణాలు గుర్తిండంపై ఆర్ఎంపి వైద్యులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వజ్రపుకొత్తూరు ఆర్ఎంపి వైద్యుల సంఘం అధ్యక్షుడు ఎం.సవరయ్య, ఆ సంఘం ప్రతినిధులు ఎం.భాస్కరరావు, ఉపాధ్యక్షుడు సిహెచ్ నీలకంఠం, ఎం.భాస్కరరావు, బద్రి ఆనందరావు, ఆర్ఎంపి వైద్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం

మెళియాపుట్టి: టిడిపి అధిష్టానం, ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ఆశీస్సులతో టిడిపి పార్లమెంటరీ నియోజకవర్గ ఆర్గనైజింగ్ సెక్రటరీ (కార్యనిర్వాహక కార్యదర్శి)గా అనపాన రాజశేఖర్ రెడ్డి నియమితులైన సందర్భంగా శుక్రవారం ఎమ్మెల్యే స్వగృహంలో టిడిపి మాజీ మండల అధ్యక్షులు, మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ అనపాన రాజశేఖర్ రెడ్డి, ఎమ్మెల్యే మామిడి గోవిందరావు (ఎంజీఆర్)ను, నియోజకవర్గ నాయకులు, ఎమ్మెల్యే తనయుడు మామిడి జై గణేష్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం దుశ్శాలువతో ఘనంగా సత్కరించి, టిడిపి పార్లమెంటరీ నియోజకవర్గ ఆర్గనైజింగ్ సెక్రటరీగా నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి సవలాపురం ఎల్లం నాయుడు, యూనిట్ కన్వీనర్ దుక్క లక్ష్మీకాంత్ రెడ్డి, గాలి రామకృష్ణ పాల్గొన్నారు.

కళాకారులకు అవార్డులు

ఇచ్ఛాపురం: తిరుమల తిరుపతి దేవస్థానం సౌజన్యంతో శ్రీకృష్ణ నాటరాజలయం అకాడమి ఆధ్వర్యంలో తిరుపతి నృత్యోత్సవంలో పాల్గొన్న కళాకారులు ఉత్తమ నృత్యాలకు అవార్డులు అందుకోవడం హర్షణీయమని అకాడమి అధ్యక్షులు గోవిందరావు అన్నారు. ఈ నెల 25న శ్రీస్వేచ్ఛా నృత్య తరంగిణి బృందం కార్యక్రమంలో పాల్గొని అవార్డులు అందుకున్నారు. అకాడమి అధ్యక్షులు గోవిందరావు, డి.శిరీష పట్నాయక్‌లకు నాట్య స్రష్టా అవార్డులు, కళాకారులు టి.చైత్ర, భవ్య శ్రీలమ్మాయి, జై మాన్విష. డి యశోద, బి.ఎస్విత, శ్రావణిలకు శ్రీకృష్ణ నాట్య మధుబాల అవార్డులను ముఖ్య అతిథులు తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు మాజీ మెంబర్ పోకల అశోక్ కుమార్ చేతులమీదుగా అవార్డులు అందుకున్నారు. నాట్య కళాకారులకు నాట్య గురువు మంగి దివ్య, అకాడమీ అధ్యక్షులు గోవిందరావు, కోశాధికారి మంగి దలమ్మ, విద్యార్థుల తల్లిదండ్రులు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.


ఎంపీ కలిశెట్టిని కలిసిన నీలవేణి

ఎంపీని కలిసిన నీలవేణి

ప్రజాశక్తి- రణస్థలం

విజయనగరం టిడిపి పార్లమెంటరీ కమిటీకి ఎచ్చెర్ల నియోజకవర్గం టిడిపి సీనియర్ నాయకులు దుంగ వెంకటరావు సతీమణి దుంగ నీలవేణి పార్లమెంటరీ సెక్రటరీగా నియమితులవ్వడంతో శుక్రవారం ఎంపీ క్యాంపు కార్యాలయంలో ఎంపీ కలిశెట్టి అప్పల నాయుడుని మర్యాదపూర్వకంగా కలిశారు. ఎంపీ నీలవేణిని సత్కరించి టిడిపి బలోపేతానికి కృషి చేయాలని శుభాకాంక్షలు తెలిపారు.



ఘనంగా కృష్ణచైతన్య జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి- నరసన్నపేట

వైసిపి యువనేత డాక్టర్ ధర్మాన కృష్ణచైతన్య జన్మదిన వేడుకలు నియోజకవర్గ వ్యాప్తంగా గురువారం నిర్వహించారు. కృష్ణచైతన్య అందుబాటులో లేనప్పటికీ, కార్యకర్తలు, అభిమానులు ఆయనపై తమకున్న ప్రేమాభిమానాలను చాటుకుంటూ వేడుకలను పండుగలా నిర్వహించారు. మబగాంలో జరిగిన ప్రధాన కార్యక్రమంలో మాజీ ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్, పద్మప్రియ దంపతులు పాల్గొని సందడి చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ముఖ్య నాయకులు కృష్ణచైతన్య రాజకీయ ప్రస్థానంపై రూపొందించిన 'స్పెషల్ సాంగ్' సిడిని ఆవిష్కరించారు. వృద్ధాశ్రమంలో మహిళా నాయకులు వృద్ధులతో కలిసి కేక్ కట్ చేసి, వారికి పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు.


అభ్యాసన సామర్థ్యాలు పరిశీలిస్తున్న ఎంఇఒ అప్పారావు

శతశాతం ఉత్తీర్ణతకు ప్రణాళిక అవసరం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

విద్యార్థులు శతాశతం ఉత్తీర్ణత సాధనకు ప్రణాళిక రూపొందించుకోవాలని ఎంఇఒ అప్పారావు అన్నారు. శుక్రవారం కొలిగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల 100 రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా ఉదయం కొలిగాం స్టడీ. అవర్, సాయంత్రం స్లిప్ టెస్ట్ నిర్వహణ తీరును పర్యవేక్షించారు. విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత దిశగా ప్రణాళిక ఏర్పర్చుకొని అవగాహన కల్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రతివిద్యార్థి దారాలంగా చదవడం, రాయడం గణితంలో చతుర్వేద ప్రక్రియలు సరళంగా చేయగలిగేటట్లు సమాయత్తం చేయాలని ఉపాధ్యాయులను సూచించారు. 5వ తరగతి విద్యార్థులతో ముచ్చటించి ఆంగ్ల భాషలో మెలకువలు నేర్పారు.